# అన్వేషణ

ఆ వేళంతా మబ్బు మబ్బుగానే ఉంది. చినుకు పడుతుందేమోనని భ్రమ, ఆశ. కాని సాయంత్రందాకా మబ్బులు ఊరికే ఊరిస్తూనేఉన్నాయి. ఆకైనా కదలలేదు. ఎండ తళుకు లేక రోజంతా చల్లగా సాగింది.

శంకరరావుకు అలా మబ్బుగా చల్లగా ఉంటే ఎంతో ఆనందం. ఏ కొండప్రదేశంలోనో మబ్బుల్లో విహరిస్తున్నట్లు ఊహించుకోవచ్చు.

సాయంత్రం అయిదింటికే కొట్టు వదిలేసి బయలుదేరాడు. ఆరోజు అసలు కొట్లో ఏమీ సందడిగాలేదు. ఎవరోవచ్చి సరదాగా కాస్సేపు షాపంతాచూసి పోయ్యేవాళ్ళు; అంతే. వ్యాపారమేమి జరుగలేదు. అది మామూలే. ఒక్కోరోజు ఉన్నగుమాస్తాలంతా చాలరు; అతనుకూడా వెళ్ళి చూడాలి. ఒక్కోరోజు అందరూ, ఊరికే, కొనేవారి కోసం ఎదురుచూస్తూ కూర్చోవాలి. ఎలాగైనా అతనికి రోజంతా షాపులోనే గడపటం అలవాటైంది.

రోజూ ప్రొద్దునే శుభ్రంగా స్నానంచేసి తయారై ఎనిమిది గంటలకల్లా వెళ్ళడం; మళ్ళా పన్నిండింటికి తిరిగి రావడం; మళ్లా సాయంత్రం మూడింటికి వెడితే ఏడింటివరకూ కూర్చోడం ఇది మామూలు. సాధారణంగా ఏడింటి తరువాత ఏంచెయ్యాలో అతనికి తోచేదికాదు. కొంచంసేపు కారులో

పార్కు దగ్గర తిరిగి, ఇంటికి పోతుండేవాడు. భోంచేసి ప్రొద్దున పత్రికే మళ్లా ఇంకోసారి తిరిగేసేలోపున అతనికి నిద్రవచ్చేది; అంతే రోజు గడిచిపోయినట్లే.

అసలు రోజెట్లాగడుస్తుందా అన్నది అతనికెప్పుడూ ఒక సమస్యగా లేదు. పగలంతా ఎట్లాగూ షాపులో గడిచి పోతుంది. రాత్రి ఇంటికి చేరుకొనేప్పటికి నిద్ర కనిపెట్టుకొని ఉంటుంది. అంతే. అతనికి వార్తాపత్రికతప్ప ఇంకేదీ చదవడం అలవాటు లేదు. కాలక్షేపానికైనా చదువుకోవచ్చునని అతని కెప్పుడూ తట్టలేదు.

ఇరవయ్యేళ్ళ క్రిందట ఈఊరు వచ్చినప్పుడు అతనికి చదువులేదు; డబ్బులేదు; ఇల్లులేదు. అన్నీ తనఊళ్ళోనే వది లేసి కట్టుబట్టలతో వచ్చాడు. అతను పుట్టినఊళ్ళో చదువు స్కూల్ ఫైనల్ నరకేవుంది. అంతవరకే చదువు వచ్చింది. చిన్నప్పుడే తల్లితండ్రులుపోగా, పెంచిన మేనమామ పొరు గూరు పంపి చదివించడానికి డబ్బులేదన్నాడు. అంతవరకు చదివించిన దానికికూడా ఆరువేలు అప్పు చూపించాడు. ఏవూరైనా వెళ్ళి పురుషలక్షణమైన ఉద్యోగానికి ప్రయత్నం చెయ్యమన్నాడు. కావాలిస్తే, తనదగ్గర చిన్నప్పుడు చదువు కొని ప్రస్తుతం పట్నంలో ఉద్యోగస్తులుగా, వ్యాపారస్తు లుగా ఉన్నవారికి కొందరికి ఉత్తరాలిస్తానని ఒకటి రెండు కాగితాలు చేతికిచ్చాడు; అంతే అంతటితో ఆయన బాధ్యత వదుల్చుకున్నాడు. శంకరరావు తనకున్న ఒక్క ఇల్లు అప్పుకు కట్టి పట్నం చేరుకున్నాడు.

మేనమామ ఉత్తరాలిచ్చిన ఇద్దరు వ్యక్తుల్లో ఒకాయన

పేరు వెంకయ్యగారు. ఆయన బట్టలవ్యాపారస్థుడు. శంకరరావు సరిగా ఉత్తరంతో ప్రత్యక్షమైన సమయంలోనే ఆయన ఒక నమ్మకమైన మనిషికోసం ఎదురుచూస్తున్నాడు తనఊరివాడు, తన పంతులుగారి మేనల్లుడు అన్న నమ్మకంతో ఆయన వెంటనే శంకరరావును తన షాపులో ఉంచుకొన్నాడు. క్రమ క్రమంగా వ్యాపార భారమంతా శంకరరావుకే అప్పగించాడు. శంకరరావు వ్యాపారంలోని కిటుకులన్నీ తెలుసుకున్నాడు. జాగ్రత్తగా గడుపుకుంటూ ఎనిమిదేళ్ళలో ఎనిమిది వేలు దాచుకున్నాడు. అంతలో అనుకోకుండా వెంకయ్యగారికి వ్యాపారంలో నష్టంవచ్చింది. ఆయన కొట్టు అమ్మేశారు. ఎనిమిది వేల రూపాయల సరుకు మాత్రం కొనుక్కుని, శంకరరావు చిన్న కొట్టు సొంతంగా పెట్టాడు. అదృష్టం తిరిగి క్రమంగా చిన్నకొట్టే పెద్దదయింది. బ్యాంకులో ధనం నిలిచింది. శంకరరావు జీవితం బాహ్యంగా మారింది. కారు, ఇల్లు, వంటవాడు—అన్నీ వాటంతట వే అమరాయి. అతని వ్యక్తిత్వంలో మాత్రం మార్పురాలేదు.

ఆ వేళ సాయంత్రం అయిదింటికే కొట్టువదలి బయలు దేరాడు. కారు టౌనుహాలు దాటుతూ ఉండగా డ్రైవరు "ఏ వేపు వెళ్ళమంటారు?" అని అడిగాడు. శంకరరావు ఒక్క క్షణం ఆలోచించాడు. ఆ వేళ వర్తకసంఘం భవనంలో ఏదో సభ ఉంది. ఎవరో స్వామిజీ మాట్లాడుతున్నారట. తనదగ్గరకు చందాకోసం వచ్చినవాళ్లు ఆహ్వానం ఇచ్చి, మరీమరీ చెప్పారు–తప్పకుండా రండి. స్వామిజీ అద్భుతంగా మాట్లాడుతారు; వినితీరాలి" అని. కాని, ఇప్పుడతనికి వెళ్ళా

లనిపించలేదు. అసలతనికి ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళాలనిపించదు. ఒక్క క్షణం ఆగి "మామూలుగా పార్కుకేసే వెళ్ళనీ" అన్నాడు.

ఆ పార్కు అంతా చుట్టి తిరిగితే ఒక మైలవుతుంది. నిదానంగా వచ్చేపొయ్యేవాళ్ళని చూస్తూ, ఎరిగున్నవాళ్ళని పలకరిస్తూ శంకరరావు రోజూ అక్కడ ఓ గంట కాలక్షేపం చేస్తాడు. అతనికి అక్కడ తోటవాళ్ళంతా కూడా తెలుసు. అందరినీ పలకరించి వారి గొడవలు విచారిస్తుంటాడు. ఆవేళ పార్కులో ఎక్కువ జనం లేరు. మబ్బుగా ఉందని ఎవరూ రాలేదు. శంకరరావు ఒక బెంచిమీద కూర్చున్నాడు. పెద్ద తోటమాలి వచ్చి పలకరించాడు:

"ఇవ్వాళ బాబుగారు త్వరగా వచ్చారే" అన్నాడు.

శంకరరావు చిరునవ్వు నవ్వాడు. "చల్లగా ఉంది గదా!" అన్నాడు.

"అవునండీ! వర్షం పడితే బాగుండును. చెట్లు ఎండకి మాడిపోతున్నాయి" అన్నాడు తోటమాలి.

"ఏమో, రాత్రికి పడుతుందేమో! అన్నట్టు, మీ పెద్దబ్బాయి పరీక్ష తెలిసిందా?" అన్నాడు శంకరరావు.

"ఇంకా లేదండి. పాసై పోతాడు లెండి" అని నిర్లక్ష్యంగా జవాబిచ్చాడు తోటమాలి.

"మంచిదే" అంటూ లేచాడు శంకరరావు. అణాలు కూడబెట్టి, తోటమాలి కొడుక్కి చదువు చెప్పిస్తున్నాడని శంకరరావుకు చాల సంతోషం.

కారు దగ్గరికి వచ్చి టైము చూసుకుంటే ఆరే అయింది.

ఇంకో రెండు గంటలు ఎలా గడపాలో తెలియలేదు. "సరే, సభకు వెళదా మ"నుకొన్నాడు. అతను వెళ్లేసరికి ఉపన్యాసం ముగింపుకు వస్తోంది. హాలునిండా జనం మంత్రముగ్ధుల్లా చలనంలేకుండా వింటున్నారు. తను ఎవరికీ కనపడకుండా ఏదో ఒక మూల కాస్సేపుండి వెళ్ళిపోదామనుకున్నాడు. కాని, కార్యదర్శి దూరాన్నించి చూసి, గుర్తుపట్టాడు. హడావిడిగా వచ్చి, ముందుకు తీసుకువెళ్ళాడు. అక్కడ చోటులేదు. ఒక కుర్చీ ప్రత్యేకంగా తెప్పించి వేయించాడు. జనం అంతా ఒక్కక్షణం ఉపన్యాసం మాట మరచిపోయి, ఈ హడావిడి ఏమిటా అని చూశారు. స్వామీజీ ఒక్కక్షణం ఉపన్యాసం ఆపేసి, శంకరరావుకేసి చూశారు. అతను సిగ్గుతో క్రుంగి పోయాడు. చేసేదిలేక, సర్దుకు కూర్చున్నాడు. స్వామిజీ ఏమీ జరగనట్లే మళ్లా, ఉపన్యాసం ప్రారంభించారు.

"కాబట్టి మీరు క్రమక్రమంగా క్షణికమైన యీ భౌతికవస్తువులమీద మమకారం వదలి, మీ పవిత్రమైన ప్రేమను నాశరహితమై పవిత్రమైన పరమాత్మునియందే లగ్నం చేయ్యటం నేర్చుకోవాలి. అప్పుడే నిజంగా శాంతి సుఖమూ లభిస్తాయి. అంతవరకు అసంతృప్తీ దుఃఖమూ తప్పవు. ఏదో ఒక వస్తువుమీద, ఒక వ్యక్తిమీద, మాత్రమే లగ్నమై ఉన్నంతవరకూ మీ ప్రేమకు పరిపూర్ణత్వం సిద్ధించదు. ఎప్పుడో ఒకప్పుడు ఆ అనురాగం వ్యర్థమని స్ఫురించక తప్పదు. అమృతరూపుడు, ఆనందమూర్తి ఐన భగవంతుని యందు లగ్నమైనప్పుడు మాత్రమే ప్రేమ పవిత్రము, పరిపూర్ణము శాంతిదాయకము అవుతుంది. అది ఎప్పుడూ

సఫలమే అవుతుంది. అంతే, నేను ఇవ్వాళ చెప్పదలచు కొన్నది,''అని ముగించారు. 'ఓమ్'అంటూ అందరూ లేచారు.

కార్యదర్శి శంకరరావును స్వామీజీకి పరిచయం చేస్తానన్నాడు. అతను వద్దని వచ్చేశాడు. కారులో అతను స్వామీజీ మాటలు మననంచేసుకోసాగాడు. అతనికి చిన్నప్పటినుంచీ ఎక్కువ భగవద్భక్తి లేదు. అతనిబుద్ధి ఎందుకో అటువేపు మళ్ళదు. కష్టపడి పనిచెయ్యటం, బ్రతుకుతెరువు చూచుకోడం, ముక్కుసూటిగా వెడుతూ, మంచేదో చెడేదో తోచినట్లు నిర్ణయించుకొని మనస్సు ప్రశాంతంగా ఉంచుకొనటం, అంతకన్న అతనికి వేరే ఆలోచనలు లేవు. ఇవ్వాళ ఈ స్వామీజీ అతనిని తట్టి, లేపి "భగవంతుడు ఒకడున్నాడు సుమా; అది మరచిపోయినావా !'' అని జ్ఞాపకంచేసినట్లయింది. కాని ఆలోచించగా అతనికి స్వామీజీ మాటలు యదార్థంగా తోచలేదు. ఒకవ్యక్తిని ప్రేమించినప్పుడు ఆ వ్యక్తి మనల్ని తిరిగి ప్రేమించాలన్న కోరిక సహజంగా కలుగుతుంది. ఆవ్యక్తి మనయందు కొంత ఆసక్తి, అనురాగం చూపించినప్పుడే మనహృదయంలో ప్రేమ వికాసం పొందుతుంది. లేకపోతే క్రమంగా నశించిపోతుంది. అవ్యక్తమైన మూర్తిని ప్రేమించినప్పుడు ఆమూర్తి మనలను ప్రేమిస్తున్నట్లు అనుభవం ఎట్లా కలుగుతుంది? అది అతనికి అర్థం కాలేదు.

ఇంటికి వెళ్ళి, స్నానంచేసి, భోంచేసి, పడుకున్నాడు. అపురూపంగా ఆవేళ జీవితంలో మొట్టమొదటిసారిగా అతనికి నిద్ర పట్టలేదు. సాధారణంగా పత్రికతీసి చదివినవార్తలే మళ్ళీ

చూసే లోపల అతనికి నిద్రవచ్చేస్తుంది. ఆవేళ ఎంత ప్రయత్నించినా నిద్రపట్టలేదు. ఊరికే మణిమేఖల గుర్తువచ్చింది. కన్నులు మూసినా తెరచినా ఆమె రూపమే నాట్యమాడింది. ఆమె అతని జీవితంలో అడుగుపెట్టి ఆరు నెలలైంది. ఆమె తల్లి పార్వతమ్మ ఆ ఊళ్ళో స్త్రీల పాఠశాల ప్రధానాధ్యాపకురాలు. పుట్టినప్పటినుంచి అరవదేశంలో ఉండడంచేత వాళ్ళింట్లో అరవభాష, అరవ నాగరకత ఎక్కువ. అందుకే ఆమె కూతురికి మణిమేఖల అని పేరు పెట్టింది.

పార్వతమ్మ చిన్నప్పుడు భర్తతో ఏ కొద్ది రోజులు కాపరం చేసిందో ఆమెకు గుర్తులేదు. మణిమేఖల పసిపిల్లగా ఉండగా అతను పైచదువుకోసం అమెరికా వెళ్లాడు. అంతే. అంతటితో అతను ఆమె జీవితంలోనించి నిష్క్రమించాడు. అమెరికా వెళ్ళినతను తిరిగి రానూలేదు. ఈమెను రమ్మననూ లేదు. కొన్నాళ్ళకి వ్రాసిన ఉత్తరాలకు జవాబూ లేదు. సహజంగా ధైర్యం కలది కాబట్టి పార్వతమ్మ తండ్రి ప్రోద్బలంతో చదువుకొని అధ్యాపకురాలైంది. ఆ తరువాత ఆవిడ జీవితం ఉద్యోగం, డబ్బు, కూతురు వీటితోనే పెనవేసుకున్నది. ధనమూ, దర్జా వీటిమీద ఆమెకు విపరీతమైన మోహం. ఆవిడ జీవితంలో ఇంక దేనికీ స్థానంలేదు.

ఓ ఏడాదిగా ఆవిడ బట్టలు శంకరరావు కొట్లోతప్ప ఎక్కడా కొనడంలేదు. అక్కడే వాళ్ళకు ఖాతా. ఆఖాతాకు సంబంధించిన డబ్బు ఇవ్వమని ఎప్పుడూ శంకరరావు అడగనూ లేదు ఆమె ఇవ్వనూలేదు. కొట్టుకు వచ్చినప్పుడల్లా పార్వతమ్మ శంకరరావుతో ఏవో కబుర్లు చెపుతుండేది. క్రమంగా, అతన్ని

ఓ రోజు వాళ్ళింటికి రమ్మని పిలిచింది. ఆ తరువాత ఆరు నెలలుగా ఇప్పుడతనికి రోజూ వాళ్ళింటికి వెళ్ళి కాస్సేపు కబుర్లు చెబుతూ ఉండడం ఒక అలవాటయింది. సాధారణంగా, పార్కునుంచి వాళ్ళింటికి వెళ్ళుతుంటాడు.

పార్వతమ్మ, మణిమేఖల అతనితో సరదాగా మాట్లాడుతుంటారు. బాగా పరిచయం అయ్యాక ఓ రోజు పార్వతమ్మ అడిగింది :

"మీకింకా పెళ్ళికాలేదేమీ? తగిన పిల్ల దొరకలేదా? పోనీ మా మణిమేఖలను చేసుకుంటారా ?" అని.

ఆమాటకు అతను ఉలిక్కిపడ్డాడు. అతని జీవితంలో అంతవరకు వివాహప్రస్తావన ఎప్పుడూ రాలేదు. మేనమామ పట్టించుకోలేదు. అతనూ ప్రయత్నించలేదు.

మణిమేఖల అందంగా, గాజుబొమ్మలా వుంటుంది. చెంపకు చారడేసిఉన్న ఆమె నల్లనికన్నులలో ఎప్పుడూ అమాయకత్వం తొణికిసలాడుతుంటుంది. ఆపిల్ల మాటలు, చేష్టలు ఆమెకింకా పసితనం వదల్లేదని వ్యక్తంచేస్తుంటాయి. అమాయకత్వం, అందం మూర్తీభవించిన ఆ పిల్లను పార్వతమ్మ "మీరు చేసుకుంటారా" అంటే, అతని ఆశ్చర్యానికి అంతులేదు. ఒక్కసారి తన్ను తాను మరచిపోయి భ్రాంతిలో పడ్డాడు. తనకూ మణిమేఖలకూ ఉన్న వయస్సు తేడా తారతమ్యం అన్నీ మరచిపోయినాడు. పార్వతమ్మ మణిమేఖల అంగీకారంతోనే తనను అడిగివుంటుందనుకున్నాడు. స్వప్న సౌధాలు నిర్మించుకున్నాడు. ఆరోజునుంచి అతని మనస్సుకు శాంతిలేదు. అతని హృదయం అనేకమైన మధురభావాలలో

ఊగిసలాడింది. మణిమేఖల అమాయకపు చేష్టలన్నింటిలో అతనికి అనురాగమే వ్యక్తమైంది.

ఇవ్వాళ, ఆ మోహం మరీ విపరీతమైంది. తెల్లవారగానే పార్వతమ్మ ఇంటికి వెళ్ళాలనుకున్నాడు. ఆవిడకి చెప్పి త్వరలోనే వివాహం స్థిరపరచుకోవాలనుకున్నాడు. మణిమేఖల తనఇంట్లో తిరుగుతూవుంటే, ఎంతబాగుంటుంది! ఈ మధురమైన ఊహతో అతనికి నిద్రపట్టింది.

ఆవేళ ఆదివారం పార్వతమ్మ తీరికగానేవుంది. మణిమేఖలమాత్రం కనపడలేదు. వెళ్ళిన కాసేపటికి శంకరరావు అన్నాడు:

"మణిమేఖలను సాకిస్తానన్నారుగదా! పెళ్ళి ఏర్పాట్లు త్వరలోనే చేసుకుందాము" అని.

చాలాసేపటివరకు పార్వతమ్మ మాట్లాడలేదు. తరువాత తాపీగా అన్నది:

"ఆ! అప్పుడేదో అన్నాను. కాని మాపిల్ల ఒప్పుకోవటంలేదు. ఎవరో ఇంజనీరుట! అతన్ని చేసుకుంటానంటోంది. అతనికి నెలకు రెండువేలు జీతం. ఈరోజుల్లో వ్యాపారాలకంటే, నెలజీతాలే నయం. పాపం మీకొట్లో అందరికి ఖాతాలేట! ఎవరూ డబ్బు ఇవ్వరట! మీ వ్యాపారం ఇంక ఎక్కువరోజులు నిలువదేమో నన్నాడు మీ గుమాస్తా! మీతో ఏం సుఖపడుతుంది!" అన్నది.

శంకరరావు నెవరో కొరడాతోకొట్టి వెక్కిరించినట్లయింది. ప్రతిమలా కూర్చుండిపోయాడు. కొంతసేపటికి తేరుకున్నాడు. ఈవిడ పిల్ల నివ్వాలనుకున్నది తనకు కాదు;

తన వ్యాపారానికి, డబ్బుకు. ఎవరి ఆదాయం ఎక్కువైతే అదే మంచి సంబంధం! మణిమేఖల ఉద్దేశ్యంకూడా అంతేనా!_ అనుకున్నాడు మాట్లాడకుండా లేచి గుమ్మం దాటాడు. మెట్లు దిగుతూవుండగా మణిమేఖల ఎదురైంది. ఒయ్యారంగా ఒంగి నవ్వుతో నమస్కారం చేసింది. అతని గుండె చెరువైంది. భారంగా ఉద్వేగాన్ని అణచుకుంటూ అన్నాడు.

"ఎవరో ఇంజనీరును పెళ్ళి చేసుకోబోతున్నావట! శుభం" అన్నాడు.

మణిమేఖల తన పెద్దపెద్ద కళ్ళు ఇంకా పెద్దవిజేసుకొని వింతగా చూసింది.

"ఇంజనీరా! పెళ్ళా! ఎవరికి!" అన్నది.

శంకరరావుకు అంతా అయోమయం అయింది. పాపం నిజంగా ఈ పిల్లకేమీ తెలీదేమో! ఈ క్షణం దాటి పోతే మనస్సులో సందేహాలన్నీ అల్లాగే ఉండిపోతాయి. అందునుంచి ఒక్కఅడుగు ముందుకువేసి నెమ్మదిగా అడిగాడు. "చూడు; నన్ను పెళ్ళిచేసుకోడం నీకిష్టమేనా?"అని. ఆమె ఇంకా తెల్లపోయి బెదిరిన లేడిలా చూసింది. మళ్ళా తనలో తాను ముడుచుకుపోయి బిక్కమొహం వేసుకుంది. "అసలు నాకు పెళ్ళిచేసుకోవాలనిలేదు. నేను డాక్టరు చదవాలి. అమ్మతో చెప్పాను" అన్నది అమాయకంగా సణుగుతూ. బాధతో అతను మెట్లు దిగిపోయాడు.

ఆరోజుతో శంకరరావు జీవితంలో ప్రశాంతి నశించింది. మనస్సులో ఏ ఆశలు, ఆలోచనలు లేనన్నాళ్లు మన్ను తిన్న

పాములా జీవితం ప్రశాంతంగానే గడచిపోతుంది. కాని ఏదో ఒక కోరిక, కల్పనమనస్సుని ఆవరించుకుని జీవితాన్ని పెనవేసుకున్నప్పుడు అది విఫలమైతే మిగిలేది కల్లోలమే. శాంతిలేదు. హాయిగా నిద్రపోతూన్నప్పుడు మధురమైన కల వస్తుంది. వెంటనే మెళుకువ వస్తుంది. ఆ కల మరపురాదు; మళ్ళా నిద్రరాదు.

ఆరు నెలల్లో పార్వతమ్మ కూతురు పెళ్ళిచేసింది. మణిమేఖల భర్తతో ఆ ఊరివిడిచి వెళ్ళిపోయింది. శంకరరావు హృదయం మళ్ళా కుదుటబడలేదు. ఎన్నడూ ఎరుగని ఏదో వెలితి, ఆరాటము అతని జీవితాన్ని కమ్ముకున్నాయి. చెప్ప లేని ఒంటరితనం బాధించింది. ఈ జీవితయాత్ర ఎన్నాళ్ళా, దేనికోసం అనే నిరాశ ఆవహించింది. నిర్మలంగా ఉన్న నీటిలో ఒక మట్టిబెడ్డ విసరితే అంతా కల్లోల మవుతుంది. మళ్ళా సర్దుకోడానికి కొంతసేపు పడుతుంది. ఎంతసేపో భగవంతునికే తెలియాలి.

రోజులు గడిచేకొద్దీ శంకరరావుకు నిరాశా, అసంతృప్తీ ఎక్కువైనాయి. వ్యాపారంమీద కూడ ఉత్సాహం తగ్గి పోయింది. చూటిమాటికి అప్పుడెప్పుడో యథాలాపంగా విన్న స్వామీజీ మాటలు జ్ఞప్తికి రాసాగాయి. క్రమంగా ఆయన చెప్పినది నిజమేనేమో ననిపించింది. ఆయన్ను మళ్లా కలుసుకుంటె శాంతి లభిస్తుందేమోనని ఆశ కలిగింది. వర్తక సంఘం కార్యదర్శి దగ్గరకు వెళ్ళి అడిగాడు: "స్వామిజీ ఎక్కడ ఉంటారు? ఎల్లా కలుసుకోవచ్చు" అని, అతను నవ్వాడు.

"ఆయన ఎక్కడఉంటారని ఎట్లా చెప్పగలం. ఎక్కడో తిరుగుతూఉంటారు. మనకు కనిపించినప్పుడు వచ్చారనుకోవలసిందే" అన్నాడు.

మళ్ళా నిరాశ! మళ్ళా ఆవేదన! శంకరరావు భరించలేకపోయాడు. ఒకఊరేమిటి! అన్నిఊళ్లూ వెతికితే! ఎక్కడో ఒకచోట కలుసుకోవచ్చు! అంతే. ఆ ఆలోచనతో శంకరరావు తనకొట్టు అమ్మేశాడు. ఉన్నడబ్బంతా తీసుకున్నాడు. ఆవేళే రైలెక్కాడు.

ఒక్కసంవత్సరం పుణ్యక్షేత్రాలన్నీ తిరిగాడు. స్వామిజీ ఎక్కడా కనిపించలేదు. విసుగు చెందకుండా, వెళ్ళిన ఊళ్ళే మళ్ళీ వెళ్ళాడు.

ఆవేళ రాత్రి హరద్వారం వెడుతున్నాడు. అతను కూర్చున్న పెట్టె చాలపెద్దది. ఓమూల అతను కూర్చున్నాడు. మరోమూల ఎవరో కాషాయిగుడ్డ కప్పుకు పడుకున్నాడు. అంతే; ఇంకెవరూలేరు. ఆ పడుకున్నవ్యక్తి చలనం లేకుండా నిద్రపోతున్నాడు. శంకరరావుకు అతనెవరో తెలుసుకోవాలనిపించింది, కాని, అతని ముఖం కనపడలేదు.

తెల్లవారింది, స్టేషన్ వచ్చింది. శంకరరావు దిగి, తన సామాను దింపుకున్నాడు. ప్లాట్‌ఫారమ్ మీద చప్పుడుకు ఆ పడుకున్న వ్యక్తి లేచాడు. అతనూ దిగాడు. స్వామిజీ! శంకరరావు ఆనందానికి అంతులేదు. దగ్గరగావెళ్ళి నమస్కరించాడు. తడబడుతూ తనవిషయం చెప్పాడు. "మూడేళ్ళనించి మీకోసం వెతుకుతున్నాను. ఇన్నాళ్ళకి, మిమ్మల్ని కలుసుకోగలిగాను. ఆవేళ మీరు "అనురాగమంతా భగవం

తునికి అర్పణ చెయ్యాలన్నారు. అప్పుడు నాకు అర్థం కాలేదు. ఇప్పటికి కొద్దిగా తెలుస్తోంది" అన్నాడు.

స్వామీజీ చిరునవ్వు నవ్వారు. ఏమీ మాట్లాడలేదు. చేతితో సంచి ముందుకుజాపి, శంకరరావు, మళ్ళా అన్నాడు వినయంగా :

"ఇన్నాళ్ళ నుంచీ,ఇది మీ కివ్వాలని తిరుగుతున్నాను. నా ధనమంతా ఇందులోనే ఉంది. ఇది మీరు గ్రహించాలి" అని.

స్వామీజీ గట్టిగా నవ్వారు :

"నా కెందుకయ్యా ! నేను సమస్తమూ ఈశ్వరార్పణ చేసి భగవంతుని ప్రేమించాలని చెప్పాను గాని, నన్ను ప్రేమించమని చెప్పలేదే !" అన్నారు.

శంకరరావు తెల్లబోయాడు.

జనం గుంపులు గుంపులుగా వచ్చి స్వామిజీని చుట్టుకున్నారు. ఆ గుంపులో కలిసి స్వామిజీ మాయమయ్యారు. మళ్ళా కనబడలేదు. శంకరరావుకు ఏమీ తోచలేదు. చేతిలో సంచి చాలా భారంగా తోచింది. పెద్దకూత వేస్తూ రైలు కదలిపోయింది. కాస్సేపటికి ప్లాట్‌ఫారమ్ మీద సందడంతా అణగిపోయింది. ఎటుచూచినా, ఏదో ప్రశాంతి మాత్రం మిగిలింది; అంతే.